# దిక్కుమాలిన వాచీ

ఆదిలో ఏ కర్మాకారకారుని హస్తాన్ని అలంకరించిందో గానీ, పాపం చిక్కి శల్యమైపోయింది!—జుగుప్సా జనకంగా తయారయింది. ఆదరించి అలంకరించుకొనే సున్నిత మహా స్వాంతంగలవారే కరువయిపోయేరు. ఎక్కడ పుట్టి ఎక్కడ పెరిగిందో గానీ ఆఖరికి దిక్కుమాలినదయింది!....

—అదో మేలురకం ఖరీదయిన రిస్టు వాచీయే అయివున్నట్లయితే దానికీగతి బహుశా పట్టుండక పోయేదేమో?

అశక్తులయిన చవకబారు వాటికే ఈ లోకంలో ఇంతే ఆదరణ కాబోలు మరి!

నామరూపాలు లేకుండా వికృతంగా తయారవడం చేత దాని ఖరీదు ఫలానా ఇంతుంటుందని చెప్పడం కష్టం. ఎలా అయినా ఇరవై రూపాయలకు తగ్గకుండా నలభై రూపాయలకు మించకుండా మధ్యస్థంగా ఉండుంటుందనుకోవచ్చు!—

ఇంతకీ దాన్ని ఏవ్యక్తి మొట్టమొదట పెట్టుకున్నాడో గాని దాన్ని సవ్యంగా పోషించడం మాని దానికన్యాయం చేశాడనే చెప్పాలి! బహుశా ఆవ్యక్తి దాన్ని కొనే ఉండడు. ఏ 'బిజినెస్' 'అఫరు' రూపంలోనో, లేక 'ప్రెజెంటేషను' రూపంలోనో ఉచితంగా సంపాదించి ఉంటాడు. లేకపోతే అంతనిర్లక్ష్యం అంత అనాదరణ దానిపట్ల చూపడు!—పాపం—అకాలంలో అన్యాయంగా అవస్థలకు లోనయింది.

క్రిందటి పండగ శెలవల్లో నేను మా మామగారింటికెళ్ళినప్పుడది నాకు లభ్యమయింది. పండుగ ప్రజెంటేషను కాదు! మా బావ పుస్తకాల పెట్టె దులుపుతూ ఉన్నప్పుడది టపీమని క్రిందకు రాలింది. ఏదో అణా రకం పిల్లలాడుకునే వాచీ ఏమో అని మొదటనుకున్నాను. తీరా బాగా పరిశీలించి చూసే సరికి నా అభిప్రాయం మారింది!—

"ఇదేమిటోయ్ దీన్నిలా ఇంత నిర్లక్ష్యంగా పారేసేవ్?" అనడిగేను.

"పారేయలేదండీ!—మా చిన్న చెల్లి సరదాకి అప్పుడప్పుడు పెట్టుకొని ఆడుకుంటూ ఉంటుంది. అన్నాడు మా బావ.

"బాగుంది బాగుంది!...ఏదో అణారకం చవకబారు వాచీ అనుకున్నావేమిటి పిల్లాడుకునేందుకివ్వడానికి!"

అది అంతకంటే ఎక్కువగా ఉపయోగపడదనుకుంటా!"

"ఉపయోగించడం చేతకాక పోతేసరి. బాగుచేయిస్తే బంగారులాగుంటుంది!"

"దాన్ని బాగుచేయించేటందుకు వినియోగించే డబ్బుతో క్రొత్తవాచే వస్తుందనుకుంటా!"

"అదేమిటోయ్ అలా అంటావు?!—నేబాగుచేయిస్తాను చూడు దానిని!"

"సరే మీ యిష్టం!" అన్నాడు. ఆసందర్భంలోనే దాని గతచరిత్ర కొంచెం తెలుసుకోవాలనిపించి వాడినడిగేను, దాని గతచరిత్రను సంక్షిప్తంగా చెప్పమని.

వాడు చెప్పేడు—"ఈ వాచీ ఎక్కడ జన్మించిందో నాకు తెలీదు. దాని వయస్సెంతుంటుందో కూడా తెలీదు!—దాన్ని నేనసలు కొనలేదు. నేను బొబ్బిలిలో పని చేస్తూ ఉన్న రోజుల్లో నా స్నేహితుడొకడు దీన్ని నా దగ్గరకు తీసుకొచ్చి—"దీన్ని బాగుచేయించినట్లయితే ఏమయినా ఉపయోగపడుతుందో పడదో చెప్పమని నా సలహా అడిగేడు. "నీకంతగా వాచీ పెట్టుకోవాలనే సరదాయే ఉన్నట్లయితే క్రొత్త వాచీ కొనిపెట్టుకో బ్రదర్" అని సలహా ఇచ్చేను. అతను నా సలహాని మన్నించేడు. దాన్ని నా దగ్గరే వదిలేసేడు. ఇంతకీ దాని గతచరిత్రలోని పూర్వభాగం చాలా గొప్పది!—దాన్ని నా స్నేహితుడి మేనమామ మద్రాసు రైల్వే ప్లాట్ ఫారం మీద అతి రహస్యంగా మూడు రూపాయలకు కొన్నాడు. నిజం చెప్పొద్దూ?!—అది దొంగ సొమ్ము!—అంచేతే ఆవాచి ఎటువంటిదో కూడా గమనించకుండా, చవగ్గా వస్తున్నాది కదా అనే సంతోషంతో 'గప్ చిప్'గా జేబులో పడేసుకున్నాడు!—

—"చాలా మార్లు బాగుచేయించి ఆఖరికి విసుగెత్తి మూలపడేసేడు. ఆతరువాతి దాన్ని మా స్నేహితుడు తీసుకు రావడం నా సలహా అడగడం ఆ విషయం చెప్పేను కదా!—ఓనాడు మా చెల్లి నా చేతిరిష్టు వాచీ చూచి తనకీ అలాంటిది కావాలని మారాం చేస్తే దానిచేతికి పెట్టేను కొన్నాళ్లు ఆ వాచీ పెట్టుకొని ఆడుకొంది!—ఆఖరికి దానికీ అసహ్యం వేసి ఈ పుస్తకాల డొక్కులో పడేసింది!—ఇదీ దీనిచరిత్ర!!" అని ముగించేడు మా బావ.

ఎంచేతో గానీ ఆ వాచీని చూసే సరికి నాకు జాలేసింది!—ఆదరించే వ్యక్తుంటే అమోఘంగా పనిచేస్తుందనిపించింది. మెల్లగా మూత ఊడదీసి చూసేను. కాస్త బూజు పట్టిందన్నమాటే గానీ లోపలిభాగాలన్నీ సవ్యంగానే ఉన్నాయనిపించింది. నా మట్టుక్కి!—పైని గ్లాసూ, ముల్లో, కీ హేండూ మినహా మరేలోటూ అనుపించలేదు!—ఇంతకీ ఏవస్తువుకయినా పోషకం పైనే మన్నిక ఆధారపడుంటుందని నా నమ్మకం!—జాగ్రత్తగా పొట్లాం కట్టి జేబులో వేసుకొన్నాను.

* * *

ఇంతకీ ఆ రిష్టువాచీది అదృష్టజాతకమని చెప్పడానికి వీల్లేదు! దాన్ని బాగుచేయించి అందంగా నా చేతికలంకరించుకోవాలని ఎంతో ఆశపడ్డాను. ఇక అది నా జీవితాన్ని క్రమపథంలో కాలానుగుణంగా నడిపిస్తుందనుకున్నాను!—

—కాని ఆ అభాగ్యురాలయిన వాచీకి మహా విపద్దశ వచ్చింది!—అందుకు కారణం నా భార్య తెలివితక్కువతనం, అజాగ్రత్త అనే చెప్పాలి!—లేకపోతే చాకలాడికి బట్టలేసేటప్పుడు జాగ్రత్తగా జేబులన్నీ పరిశీలించి చూసి మరీ వెయ్యద్దూ?—కనీసం ఒక్క జేబూ అయినా ఉందని తన చీరలూ జాకెట్లూ అనేసుకొని పడేస్తుందా?—బుద్ధీ, జ్ఞానం లేకపోతేసరి!—ఇంతకీ నాకూ కొంచెం జ్ఞాపకశక్తి మందగించింది. చాకలాడికి బట్టలు పడేసిన పదిరోజులకు గానీ ఆ వాచీ నాకు మస్తిష్కంలో మెదల లేదు!—అప్పుడు జ్ఞాపకమొచ్చింది అది నా నల్ల ఫాంటు జేబులో ఉన్నట్లు!—ఇంతకీ ఆ వాళ నేనింటి దగ్గరున్నప్పుడు చాకలాడొచ్చి ఉన్నట్లయితే ఇలాంటి అఘాయిత్యం జరక్కపోయుండేది నేనసలు

ఆకుండి నారాయణమూర్తి

మహాజాగర్తా అయిన వాడిని. షరీడీలు ఊడి పోయిన సందర్భంలో ఫాంటుకు తగిలించిన పిన్నులను సహితం ఒక్కటేనా మిగిలి పోకుండా తీసి మరీ వేస్తాను!—అంతటి జాగ్రత్తగల నేను అవాళ ఇంటిదగ్గరున్నట్లే అయితే ఆ వాచీకలాంటవస్థపట్టనిస్తానా?

—'ఛడీ' మని ఏ కర్కశిశిలమీదో ఉతికేసుంటాడు. ఎంతఘోరం!—తలుచుకుంటే గుండె బ్రద్దలవుతుంది!—ఇక శాశ్వతంగా ఆ వాచీ అంతర్ధాన మవుతుందనుకున్నాను!

ఇక అప్పుడు ఆ చాకలాడింటికెళ్ళి నా ప్రయోజనం లేదు. అప్పటికప్పుడే ఉతికేసే ఉంటాడనుకున్నాను. అయినా ఉతికే ముందు ఆమాత్రం చూడడూ?— వాడు దాన్ని నాకు సురక్షితంగా ఇచ్చేస్తే అదృష్టమే ననుకున్నాను. కానీ వాడు దాన్ని స్వంతం చేసుకోకుండా ఇచ్చేస్తాడనే నమ్మకమేమిటి మహా!......

...అవాళ నా భార్యతిన్న చీవాట్లన్నీ అన్నీ కావు!—ఆ వాచీమీద నాకుండే అభిమానమంతా నా భార్యమీద చాలా కోపంగా మారింది.

"ఇంతకీ మహా వంద రూపాయలిచ్చి స్వంతంగా కొన్నట్లూ, అది పోయినట్టూ అంతబాధపడతారేమిటండీ?!—మా చెల్లి ఆడుకొని పారేసిందేగా!—మీకూ మా చెల్లిలాగే పెట్టుకొని ఆడుకోవాలనుందేమిటి?" మరీ మరీ కృతిమించి పోయిందిదీను!

నాకు బాగా వళ్లుమండింది!—ఇంతకీ మా ఆవిడకు ఆ వాచీమీద మంచిఅభిప్రాయంలేదనే చెప్పాలి అదేదో పిల్లలాడుకొనే వాచీ అనే ఆమె అభిప్రాయం దాని అసలు ఖరీదంతోగానీ, మొత్తానికి దొంగాడిచేతిలోంచి మూడురూపాయలకమ్మబడింది!—దొంగాడు కాబట్టి అంత చవగ్గా ఇచ్చేసేడు, మరొకడయితే అంత చవగ్గా ఇస్తాడూ?—

ఆ రాత్రి నాకు సరిగ్గా నిద్దర పట్టలేదు. అన్నీ పీడకలలే!—ఆ మర్నాడుదయాన్నే చాకలాడు బటలు పట్టుకొని వచ్చేడు. వాడు రాగానే మొట్ట మొదట నే నడిగినది రిష్టువాచీ గురించి!—వాడు తెల్లబోయేడు! అదంతా నటనే అని నా అనుమానం!—

వాడికీ నాకూ చాలా పెద్ద ఘర్షణే జరిగింది!—ఏవేవో అనుకొని ఇరుగు పొరుగుల వాళ్ళంతా మూగేరు. ఆ ఘర్షణంతటనీ వ్రాయడం నాకిష్టం లేదు. అంచేత ఫలితాన్ని స్పష్టంగా తెలియజేస్తా!—

—బట్టలు పారేస్తూండడం, జేబులలో మరచిపోయినవి స్వంతం చేసుకుంటూ ఉండడం వాడి కలవాటు లేకపోలేదు. ఇక ఈమారు వాడే నూరికే విడిచి పెట్టడం నా కిష్టం లేకపోయింది. మొత్తానికెలా అయితేనేం నేనూ వాడూ ఓ నిర్ణయానికొచ్చి రాజీపడ్డాం! ఆ రకంగా రాజీ ఏర్పరచినది నా భార్య. అది పుసుక్కున ఆ నేయబట్టి, దాని గౌరవం చాకలాడి ముందు నిలబెట్టడంకోసం అంత తక్కువ కొప్పుకున్నాను!—ఆ వాచీ విషయం ఏమీ తేలనందుకుగానూ వాడి జీతంలో మూడు రూపాయలు తెగ్గోసే అందుకు వప్పందం జరిగింది!—"సరే! ఏటి శాశ్వతం?!—తమకి న్యాయమని తోస్తే అలాగే—కానియ్యండి" అన్నాడు దొంగ వెధవ

వాడి కా నెల ఇవ్వవలసిన అయిదు రూపాయలలోనూ మూడు రూపాయలు కొట్టేసి మిగతా రెండు రూపాయలూ ఇచ్చేసేను. గొణుక్కుంటూ వెళ్లిపోయేడా వెధవ!—

* * *

పెటి బాగా దులిపి బట్టలు సర్దుదామని ఆ పని ప్రారంభించింది శ్రీమతి!—అట్టడుగున ఓ పొట్లాం దొరికింది. విప్పి చూసింది. డొక్కు రిష్టువాచీ పసందుగా కళ్ళపడింది.

ఎందుకులెండి?—చెప్పుకుంటే సిగ్గు సిగ్గు!—మా ఆవిడ నన్నెంతగా ఏడిపించాలో అంతగానూ ఏడిపించింది!

వాచీ దొరికిందనే సంతోషం లేకపోయింది!—అనవసరంగా చాకలాడి దగ్గర నుంచి మూడు రూపాయలు పుచ్చుకున్నాను కదా అనే బాధ పట్టుకుంది!

అయితే తిరిగి వాడికిచ్చేస్తేనో?!...

—ఛీ!—ఏం బాగుంటుంది?—వాడు తనకి తెలీదు మొర్రో అన్నా మూడురూపాయలు పుచ్చుకున్నాను. ఇప్పుడు 'నా వాచీ నాదగ్గరే ఉందని' చెప్పి వాడికా డబ్బిస్తే నేను వాడి దృష్టిలో చాలా తేలికయిపోతాను. అదీ కాక ఇక ముందెప్పుడయినా, నిజంగా ఏ వయినా జేబులో మరిచి పోయినా సంగ్రహించి మరి వ్వడు!—ఏమయినా అంటే "తమరు అలా చేసినారు. తమకి యాదస్తుతక్కువ!" అని అనేస్తాడు. అంచేత తిప్పు వప్పుకొని వాడికి ఆడబ్బు తిరిగి ఇస్తే ముమ్ముందు మాకే ముప్పు!—అదీ కాక నా గౌరవానికే భంగం!

కానీ అలా అన్యాయంగా ఆర్జించిన ఆ డబ్బు నా దగ్గరుంచుకోడం వల్ల ఏదో అవ్యక్తమయిన బాధ పట్టుకుంది.

ఎంచేతో గానీ ఆవాచీని చూస్తూ ఉంటే నాకు వళ్ళు మండింది. "దిక్కుమాలిన వాచీ"—నా నోటంట వచ్చిన మాట్లే అది. పెట్లో భద్రంగా ఉండమని గిరవాటేసేను.

"మొత్తానికెలాఅయితేనేం ఘటికులు!—ఆ వాచీవల్ల మూడు రూపాయలు సంపాదించేరు. భద్రంగా పెట్లో ఉండనియ్యండి. మనబ్బాయి కొంచెం పెద్దవాడవగానే వాడి చేతికి పెడదాం ఆడుకోంటాడు!" అంది నా భార్య.

యధార్ధానికి నాకు చాలా కోపం వచ్చింది దాని వేళాకోళానికి!—కాని ఏఠనడం?—

లోపల్లోపల ఏదో బాధ!...అయ్యో!... అన్యాయంగా చాకలి దగ్గరనుంచి మూడు రూపాయలు గుంజేశాను కదా అని!—ఇంతకీ అది దొంగ వాచీ!—దానికి నీతి ఎక్కడుంటుంది?—నాలాంటి వాడిచేతే అసత్యాలు పలికించి అన్యాయం చేయించింది!—అందుకే దానిది దిక్కుమాలిన బ్రతుకయిందనుకున్నాను.

అసలింతకీ ఆ చాకలాడి కాడబ్బు తిరిగి ముట్టచెప్పడం ఎలా? అదే నా ఆలోచన!

ఆఖరికి మా ఆవిడే ఓ సలహా నిచ్చింది!

"న్యాయంగా వాడికేమీ ఇవ్వక్కరేదు, ఎన్నో బట్టలు పారేసేడు. అంతగా ఇవ్వాలనుంటే పండుగలకు మనంసామాన్యంగా ఇచ్చే 'బరాతాని'కి, ఎక్కువగా మంచి హుందాతనంగా ఇవ్వండి. ఆరకంగావాడిది వాడికిచ్చేసి సంతృప్తిపడి ఆత్మశాంతిని పొంది హాయిగా నిర్విచారంగా ఉండండి!"

ఆమె సలహా కొంచెం బాగుంటేమో ననిపించింది నాకు! ★


